RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం



CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 257 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 12-4-2026 | Pages: 8 | R2/-

సంపుటి : 17 | సంచిక : 257 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 12-4-2026 | పేజీలు : 8 | రు2/-

## టీడీపీ క్యాడర్‌తో చంద్రబాబు కాఫీ కబుర్లు...

### టీడీపీ కార్యాలయంలో శిక్షణా తరగతులు...

### క్రమం తప్పకుండా హాజరవుతున్న చంద్రబాబు...



**మంగళగిరి, సిటిజన్ టైమ్స్**

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'కాఫీ కబుర్లు' పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు రాజకీయ, పరిపాలనా అంశాలపై దిశానిర్దేశం చేశారు. రాజకీయాల్లో నిజాయతీగా ఉంటేనే విలువ ఉంటుందని, ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాలు చేయాలి కానీ జీవనోపాధిగా ఎంచుకోకూడదని ఆయన హితవు పలికారు. క్లీన్ పాలిటిక్స్‌కు టీడీపీని కేరాఫ్ అడ్రస్‌గా మార్చాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నాడు ఐటీతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినట్టే, నేడు క్వాంటం టెక్నాలజీతో ఏపీని, అమరావతిని అభివృద్ధి చేస్తున్నాం. ఈ నెల 14న క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభిస్తాం" అని వెల్లడించారు. గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను 9 సార్లు పెంచిందని, తమ ప్రభుత్వం ఛార్జీలను తగ్గిస్తోందని స్పష్టం చేశారు. సోలార్ విద్యుత్ వినియోగంపై ఫీడ్‌బ్యాక్ తీసుకోగా, తమ విద్యుత్ బిల్లుల భారం తగ్గిందని పలువురు కార్యకర్తలు ముఖ్యమంత్రికి తెలిపారు. సమగ్ర నీటి నిర్వహణ ద్వారా ప్రాజెక్టులను నింపామని, మే 15 నాటికే పంటలకు నీరు అందిస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ప్రతి కులానికి

తరువాయి 2లో..




## సీమైన్స్ ఎక్కడున్నాయో.. ఇరాన్‌కు తెలియదట..!

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో ప్రపంచం హర్మూజ్ జలసంధి పేరు తలవని రోజు లేదు. రెండు వారాల సీజ్ ఫైర్ మొదలైనా.. ఈ జలసంధి మాత్రం ఇంకా పూర్తిగా తెరుచుకోలేదు. అదీగాక హర్మూజ్‌లో ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలంటూ ఇరానే స్వయంగా ప్రకటన చేసింది. ఈ పరిస్థితికి సీమైన్స్ కారణం. ఆ జలమార్గంలో వాటిని ఏర్పాటుచేసిన ఆ దేశానికే ఇప్పుడు అవి ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియదట..! అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. తమపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించగానే ఇరాన్ హర్మూజ్‌ను బ్లాక్ చేయడం మొదలుపెట్టింది. జలసంధిని మూసివేశామని, అందులోకి ప్రవేశించే నౌకలకు నిప్పు పెడతామమని హెచ్చరించింది. కొన్ని నౌకలపై దాడులు కూడా జరిగాయి. తన శత్రుదేశాల నౌకలను అడ్డుకునేందుకు.. చిన్న పడవలను ఉపయోగించి సీమైన్స్ పరిచింది. దీంతో రవాణా పూర్తిగా పడిపోయి.. ఇంధన ధరలు భగ్గుమన్నాయి. ఇప్పుడు ఆ సీమైన్స్ తలనొప్పిగా మారాయి. ఇరాన్ వాటిని చెల్లాచెదురుగా పరిచిందని, వాటిని ఉంచిన స్థానాలను రికార్డు చేసిందో లేదో, తెలియని పరిస్థితి నెలకొందని అమెరికా అధికారులను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఒకవేళ రికార్డు చేసినా.. వాటికి ఉన్న పరికరాలు కొట్టుకుపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అలాకూడా వాటిని ఉంచిన స్థానాలను గుర్తించి, తొలగించడం కష్టతరం అవుతుందని ఆ అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు. వాటిని తొలగించే సామర్థ్యం కూడా దానివద్ద లేదని తెలుస్తోంది. సీజ్‌ఫైర్ వేళ.. హర్మూజ్‌ను తెరవాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. దానికి తగ్గట్టుగా ఇరాన్ దానిని తెరవలేకపోతోంది. ప్రత్యామ్నాయ మార్గాలంటూ కొన్ని మ్యాప్‌లను విడుదల చేసింది. సాంకేతికంగా ఉన్న పరిమితులను పరిగణనలోకి తీసుకొని దానిని తెరుస్తామని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ ఇటీవల వెల్లడించడం కూడా సీమైన్స్ సమస్యను తెలియజేస్తోందని అధికారులు ఆ అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇక, హర్మూజ్‌ను ఇరాన్ పూర్తిగా తెరవకపోవడంపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈ శాంతి చర్చల్లో పురోగతి ఉంటుందో, లేదో తెలియని అనిశ్చితి నెలకొంది. ఇవన్నీ కలిసి యుద్ధం ఏ రూపు దాలుస్తుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది.

## వెనక్కి వచ్చి.. రాహుల్‌తో మోదీ మాటామంతి

### పార్లమెంటు ప్రాంగణంలో అరుదైన దృశ్యం..

### మోదీ, రాహుల్ గాంధీ సంభాషణ..

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

దేశ రాజకీయాల్లో ఉప్పు-నిప్పులా ఉండే ప్రధానమంత్రి మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రాంగణంలో ఒకరినొకరు పలకరించుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఈరోజు మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతిని పురస్కరించుకుని పార్లమెంట్ లోని 'ప్రేరణ స్థల్' వద్ద ఏర్పాటు చేసిన నివాళి కార్యక్రమంలో

తరువాయి 2లో..



## ఏపీలో భగ్గుమంటున్న ఎండలు

## 45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. శనివారం కడప జిల్లాలో గరిష్ఠంగా 44.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ నేపథ్యంలో, ఆదివారం కూడా పలు జిల్లాల్లో తీవ్రమైన ఎండలతో పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరికలు జారీ చేసింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 200కు పైగా మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడప జిల్లా కొండాపురం మండలం పొట్టిపాడులో అత్యధికంగా 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 44.3 డిగ్రీలుగా రికార్డయింది. రాయలసీమ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఆదివారం పరిస్థితి మరింత తీవ్రంగా ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో

తరువాయి 2లో..

## తిరుమల లడ్డూకు పెరిగిన డిమాండ్..

## విక్రయాల్లో సరికొత్త రికార్డు!



**తిరుమల, సిటిజన్ టైమ్స్**

తిరుమల శ్రీవారి దర్శనం ఎంత ప్రత్యేకమో, స్వామివారి ప్రసాదమైన లడ్డూ కూడా అంతే ప్రత్యేకం. తాజాగా ఈ లడ్డూ ప్రసాదం విక్రయాల్లో సరికొత్త రికార్డు నమోదైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో టీటీడీ రికార్డు స్థాయిలో లడ్డూలను విక్రయించి భారీ ఆదాయాన్ని ఆర్జించింది. టీటీడీ గణాంకాల ప్రకారం.. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి మధ్య కాలంలో మొత్తం 13,95,43,231

తరువాయి 2లో..

## జగన్.. ఫ్యాన్ తీసేసి.. 'గొడ్డలి' గుర్తు పెట్టుకో: అనిత



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

'వినాశనం.. విధ్వంసం' వైకాపా సిద్ధాంతమని, నినాదం 'రప్పా రప్పా' అని హోం మంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. జగన్ వైకాపాకు ఫ్యాన్ గుర్తు తీసేసి.. గొడ్డలి పెట్టుకోవాలని చురకలు అంటించారు. జగన్

తరువాయి 2లో..

## అమెరికాపై నమ్మకం లేదు..

### పాక్‌కు చేరుకున్న ఇరాన్ ప్రతినిధి బృందం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పాకిస్థాన్‌లో అమెరికా- ఇరాన్ మధ్య శాంతి చర్చలకు సంబంధించి నెలకొన్న అనిశ్చితికి తెరపడింది. ఇరాన్ ప్రతినిధి బృందం శుక్రవారం ఇస్లామాబాద్‌కు చేరుకొంది. వీరికి పాక్ అధికారులు స్వాగతం పలికారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం శాంతి చర్చల్లో పాల్గొననుంది. అయితే, ముందస్తు షరతులకు యూఎస్ అంగీకరిస్తేనే.. చర్చలు ముందుకుసాగుతాయని ఇరాన్ మీడియా స్పష్టం చేసింది. రక్షణ మండలి కార్యదర్శి, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ సహా పలువురు సీనియర్ రాజకీయ, సైనిక నాయకులు కూడా ఈ బృందంలో ఉన్నారు. ఫ్లైట్ రాడర్24 ప్రకారం.. ఇరాన్ ప్రభుత్వానికి చెందిన రెండు విమానాలు ఇస్లామాబాద్‌లోని విమానాశ్రయంలో దిగాయని పేర్కొంది. ఇరాన్ ప్రతినిధుల రాకను పాక్ విదేశాంగ శాఖ ధ్రువీకరించింది.



పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, ఆ దేశ ఆర్మీచీఫ్ ఆసిమ్ మునీర్ ఇతర పాక్ అధికారులు వీరికి స్వాగతం పలికినట్లు తెలిపింది. ఇరాన్ ఇస్లామాబాద్‌కు చేరుకున్నప్పటికీ.. చర్చలు ముందుకుసాగేందుకు పలు షరతులు విధించింది. ఏ కాల్పుల విరమణ అయినా లెబనాన్‌ను కూడా

తరువాయి 2లో..

## మంత్రి టీజీ భరత్ జిమ్ వీడియోపై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌పై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆసక్తికరమైన రీతిలో

తరువాయి 2లో..

# తప్పిపోయిన బాలిక ఆచూకీ లభ్యం

**మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ బృందం మెరుపు వేగం!**

**నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ప్రశంసలు**



**మహారాణిపేట, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :11**

మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పిపోయిన ఒక చిన్నారి ఆచూకీని పోలీసులు అత్యంత వేగంగా కనిపెట్టి, సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈ ఆపరేషన్‌లో మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ చూపిన చొరవ, వృత్తి నైపుణ్యం అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి.తమ బాలిక కనిపించడం లేదని ఆందోళనతో తల్లిదండ్రులు మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు తీవ్రతను గుర్తించిన సీఐ దివాకర్ యాదవ్, తక్షణమే ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. స్వయంగా గాలింపు చర్యలను పర్యవేక్షిస్తూ, సాంకేతిక పరిజ్ఞానం మరియు క్షేత్రస్థాయి నెట్‌వర్క్‌ను సమర్థవంతంగా ఉపయోగించి గంటల వ్యవధిలోనే బాలిక ఎక్కడుందో గుర్తించారు. ఎటువంటి అపశ్రుతి కలగకుండా చిన్నారిని కాపాడి, క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ బిడ్డను మళ్ళీ చూసుకున్న తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఈ ఘటనపై స్పందిస్తూ, సీఐ దివాకర్ యాదవ్, తన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల రక్షణలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఆపదలో ఉన్న వారికి తక్షణమే స్పందించడంలో మహారాణిపేట పోలీసులు ఆదర్శంగా నిలిచారని సీపీ కొనియాడారు. సీఐ దివాకర్ యాదవ్ అంకితభావంతో చేసిన ఈ గాలింపు చర్యలు పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచాయి.

## సమానత్వ సమాజానికి పూలే మార్గం అనుసరించాలి: సీపీ శంఖబ్రత బాగ్చి



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :11**

విశాఖపట్నం నగర పోలీసు కమిషనరేట్‌లో మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, పూలే చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, సామాజిక చీకట్లను చీల్చుతూ అక్షర జ్యోతులను వెలిగించిన మహానుభావుడు మహాత్మా జ్యోతిబా పూలే అని కొనియాడారు. అంటరానితనం, కుల వివక్ష వంటి సామాజిక రుగ్మతలు విస్తరించిన కాలంలో విద్య ద్వారానే విముక్తి సాధ్యమని విశ్వసించి ఆ దిశగా కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. 1848లోనే తన భార్య సావిత్రిబాయిని విద్యావంతురాలిగా తీర్చిదిద్దడమే కాకుండా, బాలికల విద్య కోసం తొలి పాఠశాలను స్థాపించి విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అణగారిన వర్గాల సాధికారత కోసం ఆయన చేసిన సేవలు భారత చరిత్రలో చిరస్మరణీయమని తెలిపారు. మహాత్మా పూలే చూపిన మార్గంలో నడుచుకుంటూ సమానత్వం, సామాజిక న్యాయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అదే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అవుతుందని కమిషనర్ పేర్కొన్నారు.

## జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు అర్పించిన కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :11**

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఘనంగా నివాళులు అర్పించారు. నగరంలోని న్యూ కోర్టు కాంప్లెక్స్ వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి శనివారం ఉదయం పూలమాల వేసి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన విశిష్ట సేవలను కలెక్టర్ స్మరించుకున్నారు. సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ కోసం ఆయన చేసిన కృషి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార కమిషనర్ పీఎస్ నాయుడు పాల్గొని మహాత్మా పూలేకు నివాళులు అర్పించారు.



# బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం





**నర్సీపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :11**

మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతులను పురస్కరించుకుని నర్సీపట్నంలో బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సహకారం అందించింది. ఈ కార్యక్రమానికి నర్సీపట్నం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) సిహెచ్. తలుపులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆచార్యులు చక్రవర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సిహెచ్. తలుపులు మాట్లాడుతూ, మహనీయుల జయంతులను కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆసుపత్రుల్లో రక్త కొరత కారణంగా అనేక మంది రోగులు ప్రాణాపాయ స్థితిలో ఉంటున్నారని, అటువంటి వారికి ఆపన్నహస్తం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. యువత మహనీయుల ఆశయాలను అనుసరిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆచార్యులు చక్రవర్తి, వెధసం జిల్లా అధ్యక్షులు అప్పారావు, అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా కమిటీ సభ్యులు రావాడ ప్రకాష్, కిడారి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.అలాగే వెధసం నాయకులు అల్లంపల్లి ఈశ్వరరావు, బహుజన ఐక్యవేదిక నాయకులు అప్పలనాయుడు, చిరంజీవి, సంజీవ్, సూరిబాబు, గంగాధర్, మహేష్, మాణిక్యం, అప్పారావు మాస్టారు, రాజు, శ్రీను తదితరులతో పాటు పలువురు రక్తదాతలు, సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా 90వ కిషన్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవము

***రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర తక్షణమే కల్పించాలి***

***అల్లూరి జిల్లా కిషన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాంగి గంగాధర్***



**అరకు,సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:11**

డుంబ్రిగూడ మండల న్యూస్ తేదీ 11.4.2026న ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిల రెడ్డి మరియు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు కామన్న ప్రభాకర్ ఆదేశాల మేరకు డుంబ్రిగూడ మండలం లైగండ పంచాయతీ పనసపుట్ గ్రామంలో అల్లూరు జిల్లా కిషన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాంగి గంగాధర్ ఆధ్వర్యంలో ఘనంగా కిషన్ కాంగ్రెస్ 90వ ఆవిర్భావ దినోత్సవము.కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రైతులు కలిసి నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ రైతు గౌరవ వంతల ఆనందరావు గారికి పూల బొకేతో దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించడం జరిగింది గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులు పండించిన అల్లం పసుపు పిప్పళ్ళు చింతపండు ధాన్యం కాఫీ మిర్యాలు వాణిజ్య ఇతరితర పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సమస్యల కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ముందు ఉండి పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా రైతులకు కార్మికులకు కర్షకులకు ఉండే పార్టీ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతులు కాంగ్రెస్ పార్టీకి ఆదరించాలని కోరారు ఈ కార్యక్రమంలో డుంబ్రిగూడ మండల మాజీ ఎంపీపీ చట్టారి సాయిబాబా ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ తెలగంజి సోమేశ్వరరావు పిసిసి డెలిగేట్ మెంబర్ పాచిపెంట చిన్నస్వామి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిల్లో రాజబాబు భాను సిహెచ్ రావు గంపరాయి రైతులు వంతల కామేశ్వరరావు వంతల శిబో కోర్ర సన్యాసి వంతల బుజ్జన్న. వంతల సావిత్రి వంతల లక్ష్మి మజ్జి బొంజు బాబు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పూలే ఆశయాలను కొనసాగిద్దాం: మరుపిళ్ల పైడిరాజు



**మధురవాడ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :11**

సంఘ సంస్కర్త, సామాజిక వేత్త అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే 199 వ జయంతిని శనివారం మధురవాడ సిపిఐ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ మహాత్మగా పిలువబడే జ్యోతిరావు పూలే 1827 ఏప్రిల్ 11జన్మించి, 1890, నవంబరు 28 న మరణించారని తెలిపారు. తన అనుచరులతో కలిసి దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్) ను ఏర్పాటు చేసి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన ఈసంఘంలో అన్ని మతాలు, కులాల ప్రజలు కూడా చేర్చుకొని పనిచేశారని గుర్తు చేశారు. సామాజిక సంస్కరణ ఉద్యమంలో పూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డారని, పూలే అతని భార్య సావిత్రిబాయి పూలే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులయ్యారని అతను మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించి, బాలికల కోసం మొదటి పాఠశాలను1848లో పూణేలో ప్రారంభించారని తెలిపారు. వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించారని, ప్రాచీన యుగంలో గౌతమ బుద్ధుడు, ఆధునిక యుగంలో మహాత్మా జ్యోతిరావు పూలే ఇద్దరు నాకు గురువులని వారి నుంచి నేను చాల విషయాలు నేర్చుకున్నానని భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అనేక సందర్భాలలో తెలిపారని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం డి బేగం, ఏరియా కార్యదర్శి వి సత్యనారాయణ, బి కేశవయ్య, పి కాంతమ్మ, ఎం బంగారయ్య, కె జగ్గాస్వామీ, రాం మహేష్, కాలీషా,చిన్నారావు, నాగరాజు పలువురు మహిళలు పాల్గొని నివాళులు అర్పించారు.

# భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 21

## ఆర్టికల్ 21 - జీవించే హక్కు




భారత రాజ్యాంగంలోని పార్ట్‌లో ప్రాథమిక హక్కులు ముఖ్యమైన స్థానం కలిగి ఉన్నాయి. ఈ ప్రాథమిక హక్కులు పౌరుల స్వేచ్ఛను, గౌరవాన్ని కాపాడటానికి రూపొందించబడ్డాయి. వాటిలో అత్యంత ముఖ్యమైనది ఆర్టికల్ 21 -- జీవించే హక్కు మరియు వ్యక్తిగత స్వేచ్ఛ. ఆర్టికల్ 21 ప్రకారం, "చట్టం ద్వారా స్థాపించబడిన విధానం ప్రకారం తప్ప, ఏ వ్యక్తి తన జీవితాన్ని లేదా వ్యక్తిగత స్వేచ్ఛను కోల్పోకూడదు" అని స్పష్టం చేస్తుంది. ఈ హక్కు కేవలం భారత పౌరులకు మాత్రమే కాకుండా, దేశంలో ఉన్న ప్రతి వ్యక్తికి వర్తిస్తుంది. ఈ హక్కు యొక్క ప్రాముఖ్యతను పెంచుతూ, 2002లో రాజ్యాంగంలో ఆర్టికల్ 21–ఎను చేర్చారు. దీనివల్ల 6 నుండి 14 సంవత్సరాల మధ్య పిల్లలకు ఉచిత మరియు తప్పనిసరి విద్య హక్కుగా కల్పించబడింది.

ఆర్టికల్ 21లోని "జీవితం" మరియు "వ్యక్తిగత స్వేచ్ఛ" అనే పదాలను సుప్రీంకోర్టు విస్తృతంగా అర్థం చేసుకుంది. కేవలం ప్రాణం ఉండడమే కాదు, గౌరవప్రదమైన, సురక్షితమైన, అర్థవంతమైన జీవితం గడపడానికి అవసరమైన అన్ని హక్కులను ఇందులో భాగంగా పరిగణించింది. ఉదాహరణకు జీవనోపాధి, ఆరోగ్యం, పరిశుభ్రమైన పర్యావరణం, గోప్యత వంటి హక్కులు కూడా ఆర్టికల్ 21 పరిధిలోకి వచ్చాయి. ఈ హక్కు ప్రధానంగా రాష్ట్రం (ప్రభుత్వం మరియు దాని సంస్థలు) తీసుకునే ఏకపక్ష చర్యల నుంచి వ్యక్తులను రక్షిస్తుంది. అంటే, ప్రభుత్వం చట్టపరమైన విధానం పాటించకుండా ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. అందువల్ల, ఆర్టికల్ 21 భారత రాజ్యాంగంలోని అత్యంత కీలకమైన హక్కులలో ఒకటిగా భావించబడుతుంది. ఇది వ్యక్తిగత స్వేచ్ఛను రక్షిస్తూ, ప్రభుత్వ అధికారాలపై నియంత్రణ విధిస్తూ, ప్రాథమిక హక్కులు మరియు విధుల మధ్య సమతుల్యతను నెలకొల్పుతుంది.

## పాడేరు ఐటిడీఏ ప్రాజెక్ట్ అధికారిగా ఆదిత్య వర్మ బాధ్యతలు స్వీకరణ



**పాడేరు, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:11**

పాడేరు ఐటిడీఏ నూతన ప్రాజెక్ట్ అధికారిగా ఆదిత్య వర్మ శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పనిచేసిన తిరుమాని శ్రీపూజ నుండి ఆయన అధికారికంగా బాధ్యతలు అందుకున్నారు. బాధ్యతలు స్వీకరించే ముందు కుటుంబ సమేతంగా మోదకొండమ్మ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఐటిడీఏ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పరిపాలనాధికారి హేమలతతో పాటు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదిత్య వర్మ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సేవ చేసే అవకాశం లభించడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరేలా కృషి చేస్తానని, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. పారదర్శక పరిపాలనతో గిరిజనుల సమస్యలను సత్వర పరిష్కారం చేసే దిశగా పనిచేస్తానని వెల్లడించారు.

## అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా తిరుమాని శ్రీపూజ బాధ్యతల స్వీకరణ




**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:11**

అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా తిరుమాని శ్రీపూజ శనివారం కలెక్టరేట్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఐఏఎస్ బదిలీల్లో భాగంగా ఆమెను ఈ పదవికి నియమిం చారు. అంతకు ముందు ఆమె ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిగా సేవలందించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజావాణి వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# తల్లిదండ్రుల ఆప్యాయతతోనే చిన్నారుల భవిష్యత్తు పూలబాట

## -నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి







**విశాఖ సిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:11**

చిన్నారుల భవిష్యత్తు పూలబాటగా మారాలంటే తల్లిదండ్రుల ప్రేమ, అనురాగం, ఆప్యాయతలు అత్యంత అవసరమని నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి అన్నారు. విశాఖపట్నంలోని శ్రీ కాశ్యప్ పాఠశాల 21వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి ఆధునిక సమాజంలో తల్లిదండ్రులు పిల్లలపై ప్రేమాభిమానాలను తగ్గించి, సంపాదనపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగాలలో నిమగ్నమైన తల్లిదండ్రులు పిల్లలతో సమయం గడపలేకపోవడం వల్ల చిన్నారులు ఆప్యాయతలకు దూరమవుతున్నారని అన్నారు. పూర్వ కాలంలో పాఠశాల నుండి వచ్చిన పిల్లలను తల్లిదండ్రులు ఆప్యాయంగా పలకరించి, వారితో సమయం గడుపుతూ నీతి కథలు, పురాణ గాథలు చెప్పి మంచి నడవడికను అలవాటు చేసేవారని తెలిపారు. అలా పెరిగినవారే నేటి సమాజంలో గౌరవప్రదమైన స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అయితే పిల్లలు ఇంటికి వచ్చిన తర్వాత హోంవర్క్ చేయమని చెప్పడం, లేదా మొబైల్ ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్‌లలో వీడియో గేమ్స్‌కు అలవాటు చేయడం జరుగుతోందని, ఇది వారిని చెడు మార్గాల వైపు నడిపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో పాటు పిల్లలు ఆచారాలు, సంప్రదాయాలను కూడా మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలతో రోజూ కొంత సమయం గడిపి, వారి చదువులు, పాఠశాల విషయాలు తెలుసుకోవడం, నీతి కథలు చెప్పడం ద్వారా మంచి విలువలను నేర్పాలని సూచించారు. అలాగే పిల్లల ముందు తల్లిదండ్రులు గొడవలు పడడం, తిట్టుకోవడం, చెడు అలవాట్లు ప్రదర్శించడం వారి మనసుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. చిన్నారుల ఎదుట సత్ప్రవర్తనతో ప్రవర్తించడం ద్వారా వారి భవిష్యత్తును సక్రమంగా తీర్చిదిద్దవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ కె. శ్రీనివాస్, సౌత్ ఇండియా నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్.జి. తిలక్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కళ్యాణ మండపాలను ప్రారంభించిన మంత్రులు డోలా వీరాంజనేయ స్వామి, ఆనం రామనారాయణ రెడ్డి





**సింహాచలం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 11**

సింహాచలం శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. పెందుర్తి నియోజకవర్గం, జీవీఎంసీ 98వ వార్డు, శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో దేవస్థానం రూ.6.5 కోట్ల వ్యయంతో నిర్మించిన నాలుగు కళ్యాణ మండపాలను జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా వీరాంజనేయ స్వామి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ యొక్క పెందుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, విశాఖ ఉత్తర శాసన సభ్యులు విష్ణుకుమార్ రాజు, విజయనగరం శాసనసభ్యురాలు అదితి గజపతిరాజు, ఎన్టీఆర్ ఆరోగ్య ట్రస్ట్ చైర్మన్ సీతం రాజు సుధాకర్, సింహాచలం దేవస్థానం ఈవో వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడాకారుల సమక్షంలో ఆత్మ డైరెక్టర్ ముత్తాబత్తుల వెంకటరమణకి అభినందన సత్కారం



**అమలాపురం రూరల్ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 11**

హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ నందు సాకూరు గున్నేపల్లి మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి రాము అధ్యక్షతన ఆత్మ డైరెక్టర్ గా ఎంపికైన సాకూరు సొసైటీ డైరెక్టర్ ముత్తాబత్తుల వెంకటరమణ కి జాతీయ క్రీడాకారుల సమక్షంలో అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముత్తాబత్తుల వెంకటరమణ క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజలకు చేస్తున్న సంక్షేమ సేవా కార్యక్రమాల్లో తనదైన ప్రత్యేక ముద్ర వేసుకోవడం వల్ల ఈ పదవులు కు వన్నె తేగలరని, రైతాంగానికి సేవ చేస్తారని పెద్దిరెడ్డి రాముకొనియాడారు. ఈ అభినందన ఉత్సవ కార్యక్రమంలో మేకల కిషోర్, మావూల్య ,ఎనమదుల పల్లంరాజు,నగబేరి కృష్ణమూర్తి, సిహెచ్. శంకర్ నారాయణ, మారే వీరేంద్ర, జే.జితేంద్ర,ఎం.గణేష్, వై.ఇందిరా, జి.దినేష్ ప్రసాద్ జాతి స్థాయి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులందరూ పాల్గొన్నారని కోచ్ కంకిపాడు వెంకటేశ్వరరావు తెలిపారు.

# చట్టం అందరికీ సమానం కాదా?

### ట్రాఫిక్ రూల్స్ అమలుపై ప్రశ్నలు వెల్లువ

### 40 కిలోమీటర్ల పరిమితి... అందరికీ వర్తిస్తుందా?

### రోడ్డు భద్రత చర్యల్లో సమానత్వం కోరుతున్న నగర ప్రజలు




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 11**

విశాఖ నగరంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజల ప్రాణ భద్రతను కాపాడడం మరియు నేర నియంత్రణను బలోపేతం చేయడం లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు ఇటీవల కఠిన చర్యలు చేపట్టారు. ముఖ్యంగా వాహనాల వేగాన్ని గంటకు 40 కిలోమీటర్లకు పరిమితం చేస్తూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిమితిని అతిక్రమించే వాహనదారులపై చలానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ నిర్ణయం ప్రజల భద్రత దృష్ట్యా తీసుకున్నదిగా అధికారులు పేర్కొంటున్నప్పటికీ, అమలులో మాత్రం తీవ్ర అసమానతలు ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో సాధారణ ప్రజలపై కఠినంగా అమలు చేస్తున్న ఈ నిబంధనలు, ప్రభుత్వ వాహనాలు, ప్రైవేట్ ట్రావెల్స్, భారీ లారీలు మరియు ప్రభావశీలుల వాహనాల విషయంలో మాత్రం సడలింపుతో అమలవుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలు తరచూ 40 కిలోమీటర్ల వేగాన్ని దాటి నిర్భయంగా ప్రయాణించడం మాత్రమే కాకుండా, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కూడా లెక్కచేయకుండా ముందుకు దూసుకెళ్తున్న దృశ్యాలు ప్రతిరోజూ కనిపిస్తున్నాయని వారు చెబుతున్నారు. ఇలాంటి ఉల్లంఘనల వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని కూడా వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో సాధారణ ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, చిన్న కార్ డ్రైవర్లు మాత్రం స్వల్పంగా వేగ పరిమితిని దాటినా వెంటనే చలానాలకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో స్పీడ్ గన్స్, సీసీ కెమెరాల ఆధారంగా జరిమానాలు విధించబడుతున్నప్పటికీ, పెద్ద వాహనాల ఉల్లంఘనలు నిర్లక్ష్యం చేయబడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో "చట్టం ఒక్కటే అయితే అమలు ఎందుకు వేరేలా?" అనే ప్రశ్న ప్రజలలో గట్టిగా వినిపిస్తోంది. "సామాన్య ప్రజలకు ఒక న్యాయం, అధికార వాహనాలకు మరో న్యాయం ఎందుకు?" అంటూ వారు అధికారులను నిలదీస్తున్నారు. భారతదేశంలో ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన ప్రధాన చట్టమైన మోటార్ వెహికల్స్ యాక్ట్ 1988 ప్రకారం, రోడ్డు భద్రతకు విఘాతం కలిగించే ఏ చర్యకైనా కఠిన శిక్షలు విధించాల్సి ఉంటుంది. సెక్షన్ 112 ప్రకారం వేగ పరిమితిని అతిక్రమించిన వారికి జరిమానా విధించాలి. సెక్షన్ 184 ప్రకారం ప్రమాదకర డ్రైవింగ్‌కు భారీ జరిమానాతో పాటు జైలుశిక్ష విధించే అవకాశం ఉంది. అలాగే సెక్షన్ 119 ప్రకారం ట్రాఫిక్ సిగ్నల్స్, రూల్స్ తప్పనిసరిగా పాటించాల్సిందే. ఈ చట్టాలు ప్రభుత్వ, ప్రైవేట్, వ్యక్తిగత వాహనాలన్నింటికీ సమానంగా వర్తిస్తాయి. ఎక్కడా మినహాయింపులు లేవు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ చట్టాల అమలులో స్పష్టమైన లోపాలు ఉన్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇది ఒక్కరోజులో ఏర్పడిన సమస్య కాదని, చాలా కాలంగా కొనసాగుతున్న వ్యవస్థపరమైన లోపమని వారు పేర్కొంటున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ట్రాఫిక్ నియంత్రణలో సాంకేతికత వినియోగం పెరిగినప్పటికీ, అమలులో పారదర్శకత లేకపోతే ప్రజల నమ్మకం దెబ్బతింటుంది. చట్టాల అమలు కొందరి పైన కాకుండా అందరిపైనా సమానంగా ఉండాలి. లేదంటే చట్టాలపై గౌరవం తగ్గే ప్రమాదం ఉందని వారు నిపుణుల అభిప్రాయం. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి పలు డిమాండ్లు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారెవ్వరైనా, వారు ప్రభుత్వ వాహనాలైనా, ప్రైవేట్ వాహనాలైనా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే చలానాల విధానం పారదర్శకంగా ఉండాలని, ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా సీసీ కెమెరాలు, స్పీడ్ మానిటరింగ్ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి, ఎవరైనా ఉల్లంఘనలు చేస్తే వారికి తప్పకుండా చర్యలు తీసుకునే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచిస్తున్నారు. మొత్తానికి, ట్రాఫిక్ నియమాలు కేవలం చలానాలు వేయడానికే కాకుండా ప్రజల ప్రాణాలను కాపాడటానికి ఉన్నవి. అవి ఎంపికచేసి అమలు చేస్తే ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటుంది. కాబట్టి "ఒకే చట్టం అందరికీ సమానం" అనే సూత్రాన్ని కచ్చితంగా అమలు చేయడం ద్వారానే ట్రాఫిక్ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవచ్చని నగర ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

## జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు అర్పించిన మంత్రులు, ఎమ్మెల్యేలు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :11**

మహాత్మా జ్యోతిరావు పూలేకు రాష్ట్ర మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రామనారాయణరెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల రమేశ్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఘన నివాళుర్పించారు. పూలే జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ల మీటింగు హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు, బీసీ వెల్ఫేర్ అధికారిణి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మడ్ రిజర్వ్ మైదానంలో మూడు రోజుల క్రీడా సంబరాలు ప్రారంభం: పాల్గొన్న సిటీ కమీషనర్






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:11**

నగర పోలీసు కమీషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు విశాఖపట్నం సిటీ పోలీసు విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. నగర ఆర్మడ్ రిజర్వ్ మైదానంలో 11-04-2026 నుండి 14-04-2026 వరకు మూడు రోజుల పాటు ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీసు కమిషనర్ నగరంలోని ఉన్నత పోలీసు అధికారుల సమక్షంలో క్రీడా జెండా ఆవిష్కరించి మీట్‌ను అధికారికంగా ప్రారంభించారు. అంతకు ముందు పాల్గొన్న అన్ని టీంలు మార్చ్ ఫాస్ట్ ద్వారా గౌరవ వందనం స్వీకరించాయి. ఈ స్పోర్ట్స్ మీట్‌లో మొత్తం 10 టీంలు పాల్గొంటున్నాయి. వీటిలో వెస్ట్, సౌత్, నార్త్, హార్బర్, ఈస్ట్, ద్వారకా సబ్-డివిజన్లు, ట్రాఫిక్ డివిజన్, స్పెషల్ వింగ్ (స్పెషల్ బ్రాంచ్, సైబర్ క్రైమ్, టాస్క్ ఫోర్స్, కంట్రోల్ రూమ్, ఉమెన్ పోలీస్ స్టేషన్, సీ.సీ.ఆర్.బి), క్రైమ్ సబ్-డివిజన్ మరియు సిటీ ఆర్మడ్ రిజర్వ్ టీంలు ఉన్నాయి. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ గారు మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు ఫిట్‌నెస్ సంస్కృతిని అలవర్చుకోవాలని సూచించారు. పోటీలలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, ఓటమి తర్వాత మరింత మెరుగ్గా ప్రయత్నించి విజయాన్ని సాధించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి--1 ఎల్ - ఓ, డి.సి.పి--2 ఎల్ ఞ ఓ, డి.సి.పి క్రైమ్స్, ఏ.డి.సి.పి లు, ఏ.సి.పి లు, సీఐ లు, ఆర్.ఐ లు తదితర ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కళ్ళజోళ్లు పంపిణీ..

**ఆలమూరు సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 11**

మండల కేంద్రమైన ఆలమూరులో ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్,ఏజిపి బూసి విద్యా ప్రసన్న నేతృత్వంలో సోమవారం ఉచిత కళ్ళజోళ్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథులుగా టిడిపి మండల అధ్యక్షులు ఈదల సత్తిబాబు,కాకినాడ సత్యం స్టడీ సర్కిల్ అధినేత బూసి విద్యా సాగర్ హాజరయ్యారు. గత నెల 28న నిర్వహించిన కంటి పరీక్షలలో గుర్తించిన దృష్టి లోపాలున్న సుమారు 57 మంది రోగులకు కళ్ళజోళ్లు అందజేశారు. అనంతరం విద్యాసాగర్ సతీమణి స్వర్గీయ బూసి ఝాన్సీ రాణి జన్మదినోత్సవం సందర్భంగా ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ విద్యా ప్రసన్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలు చేరేలా చేయడం తమ ట్రస్ట్ ముఖ్య లక్ష్యమన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం చేపడతామని తెలిపారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ చేస్తున్న సేవలను అభినందిస్తూ,వాళ్లు కష్టపడి సంపాదించిన దానిలో కొంత భాగాన్ని సమాజ సేవకు వినియోగిస్తూ ముందుకు రావడం ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మంచి మార్పుకు దారి తీస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈదల నల్లబాబు, చీపురపల్లి గణేష్, మానేపల్లి శ్రీనివాస్,లంక శ్యామ్, నెల్లి చిన్న, దిడ్డి రాము, బూసీ చిట్టి కుమార్, ముప్పిరి వెర్రియ్య తదితరులు పాల్గొన్నారు.

## గొల్లవిల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు యెరుబండి భద్ర కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఆనందరావు



**ఉప్పలగుప్తం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 11**

మండలంలోని గొల్లవిల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, యెరుబండి భద్ర అకాల మరణం పార్టీకి తీరని లోటు అని అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. శనివారం గొల్లవిల్లిలోని భద్ర నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భద్ర పార్టీ ఆశయాల కోసం నిరంతరం కృషి చేసేవారని, ఆయన మరణం అత్యంత బాధాకరమని అన్నారు. వారి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయ సహకారాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఉప్పలగుప్తం మండల అధ్యక్షులు అరిగెల నానాజీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, ముఖ్య అనుచరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 11**

మహాత్మా జ్యోతిబా పూలే 199 వ జయంతి సందర్భంగా అయినవిల్లి మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వస్కా శ్యామ్ సుందర్ఆధ్వర్యంలో జయంతి వేడుకను ఘనంగా నిర్వహించడం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ సమాజంలో ఉన్న కుల వివక్ష నిర్మూలన కోసం,మహిళల విద్యాభివృద్ధి కోసం,సమ సమాజ స్థాపన కోసం,బాల్య వివాహాల నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన యోధుడు మహాత్మా జ్యోతిబా పూలేఅని,ఆయన స్పూర్తిగా అందరూ ఆయన ఆశయాల సాధన కోసం కృషి చెయ్యాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్,రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యపరాజు సత్తిబాబు రాజు, కుదుపూడి బుజ్జి, కల్లేపల్లి వెంకట సుబ్బరాజు, మట్టపర్తి అచ్యుత్,గుమ్మడి వెంకటేశ్వరరావు,బడుగు భాస్కర జోగేష్,వేటుకూరి రమేష్ రాజు, బిక్కిన బాబీ,అప్పారి మహేశ్,వెలిగట్ల సాయిబాబు,తోటకూర నాగ జోగి వర్మ,నేదునూరి నాని,మోర్త సత్తిబాబు,సానబోయిన శ్రీను,వార లక్ష్మి నరసింహ రామ్,కుసుమ బహుగుణ,బడుగు వెంకటేష్, జుత్తుక చిన్న,పాటి ప్రసాద్, గెద్దం రమేష్,మధుర రమేష్, నాగాబత్తుల ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## పూలే జయంతి రోజున కేంద్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి- యాట్ల



**రామచంద్రపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 11**

నియోజకవర్గం లోని ద్రాక్షారామ మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.భారత సామాజిక ప్రజాసామ్రాజ్యానికి మూల పురుషుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని నియోజకవర్గం ఎం.బీ.సి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు అన్నారు. జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ద్రాక్షారామ మసీదు సెంటర్ లో ఉన్న పూలే దంపతులకు పీ.డీ.ఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.సిద్దు, కొండేపూడి వినయ్ కుమార్, కొనసా కామేశ్వరరావు, పడిదడకల బీమశంకరం, మొహమ్మద్ అలీ ఖాన్, కొప్పుల సూరిబాబు,పూలమాలలు వేసి గణంగా నివాళులు అర్పించారు.అనంతరం యాట్ల మాట్లాడుతూ 1873 సెప్టెంబర్ 24న పూలే తన అనుచరులతో కలిసి దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులు పొందటానికి సత్యశోధక్ సమాజ్ సొసైటీ అఫ్ సీకర్స్ అప్ ట్రూత్ ను ఏర్పాటు చేశాడు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన ఈ సంఘంలో అన్ని మతాలు, అన్ని కులాల ప్రజలు కూడా చేరవచ్చు.లాగ్రేశీజులోని సామాజిక సంస్కరణ ఉద్యమంలో పూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డాడు.అతని భార్య సావిత్రి బాయి పూలే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులు. బాలికల కోసం 1848 లో పూణే లో మొట్ట మొదటి పాఠశాల ను స్థాపించారు. స్థానిక భారతీయులలో ఈ జంట విద్య యెక్క విశ్వీకరణను సమర్ధించిన మొదటి సంస్కర్తలు కూడా ఈ జంటనే అని కొనియాడారు.అనంతరం పూలే దంపతులు పుస్తకాలు పంపిణీ చేశారు.పూలే జయంతి రోజున కేంద్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి డిమాండ్ చేస్తూ ప్లకార్డు లతో నినాదం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గారోజు సూరిబాబు, బిల్లకుర్తి స్వామి,సూధంశెట్టి గంగాధర్, కోసనా భీమ శంకరం, పావులూరి శివరాం, వేమవరపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన పాదధర్మకంగా 34 ప్రశ్నలతో మే 1 న ప్రారంభం...

**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 11**

జనగణన పూర్తి పారదర్శకంగా నిర్వహించాలి 34 ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు సేకరించాలని, మే 1 నుంచి జనగణన ప్రారంభిస్తామని, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జన గణనను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ ఏం వెంకటేశ్వరరావు తెలియజేశారు. కుటుంబ సమగ్ర సమాచారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. జనగణన నిబంధనల మేరకు రూపొందించిన 34 ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలను సేకరించాలన్నారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు జరిగే జనగణనను పూర్తిగా మొబైల్ యాప్ లో నమోదు చేయాల్సి ఉంటుందని సూచించారు. సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జనాభా గణన పరిచయం. 2027 లో భాగంగా సెన్సస్ ఫీల్డ్ ట్రైనర్స్ ఎల్ సోమేశ్వరరావు, గుబ్బల శ్రీనివాసు, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల కు మొదటి ఫేజ్ లో 50 మందికి మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రతిచేయడం జరిగింది. ఎన్యుమరేటర్లకు ఎటువంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకోవాలన్నారు. సమాచారం సేకరణకు ఇంటింటికి వెళ్లేటప్పుడు ఎదురయ్యే ఇబ్బందులను గుర్తించి వారికి అపాయింట్మెంట్ ఆర్డర్ తో పాటు ఫోటో ఐడెంటిటీ కార్డు టూల్ కిట్లు అందజేస్థామన్నారు. స్థానికంగా ఏ కుటుంబానికి ఆ కుటుంబం తాగుతున్న నీరు నుంచి వాడుతున్న వాహనాల వరకు అన్నింటిని వరుస క్రమంలో నమోదు చేయాలని సూచించారు. జన గణనలో 34 ప్రశ్నలు ఇవే, జన గణనను






నిర్వహించేందుకు 34 ప్రశ్నలతో పక్కా సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి కుటుంబం యొక్క సమగ్ర వివరాలను మొబైల్ యాప్ లో నమోదు చేస్తారు.

జన గణన కోసం ప్రతి ఇంటికి ఒక నెంబర్ను కేటాయిస్తారు. ఆ ఇంటికి వాడిన వస్తువు మొదలుకొని గోడలను సిమెంటుతో ఇటుకలతో రాయిలతో కట్టారా ఇంటి పై కప్పుకు వాడిన వస్తువులు ఏమిటి స్వయంగా పరిశీలించి నమోదు చేస్తారు. కుటుంబ సంఖ్యను కేటాయించడంతోపాటు కుటుంబ సభ్యుల సంఖ్య కుటుంబ యజమాని పేరు లింగ బేధం నమోదు చేస్తారు. ఇంటి యాజమాన్య స్థితి అనగా సొంతిల్లు, అద్దె ఇల్లు నివాస గదుల సంఖ్య కుటుంబంలో నివసిస్తున్న వివాహ దంపతుల సంఖ్యను నమోదు చేసుకుంటారు. ఎస్సీ, ఎస్టీ లను నమోదు చేసే సమయంలో ఏ మతం నుంచి అయిన వారైనా వారిని ఎస్టీలుగా పరిగణిస్తారు, ఇక హిందువులు, సిక్కులు, బౌద్ధులను మాత్రమే ఎస్సీలుగా పరిగణిస్తారు. ఇంట్లోని వారు వినియోగించే తాగునీరు ఏ రకమైనది, మరుగుదొడ్డి వసతి ఏ రకం, మురుగునీటి పారుదల ఉందా లేదా, వంటగది ఉందా, వంట చెరుకుగా ఏమి వినియోగిస్తున్నారు, రేడియో, టెలివిజన్, ఇంటర్నెట్, ల్యాప్టాప్, మొబైల్ ఫోన్ రకం, సైకిల్, మోటార్ సైకిల్, కారు ఇతర వాహనాల రకాలు, కుటుంబంలో వినియోగించే ప్రధాన ఆహార ధాన్యం ఏమిటి, ఇంటి యజమాని వినియోగించే సెల్ ఫోన్ నెంబర్ వివరాలను నమోదు చేసుకుంటారని తహసీల్దార్ కార్యాలయం నుండి తెలియజేశారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**సమానత్వం, విద్యా, బడుగు వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయం**

**పూలే ఆశయాల స్ఫూర్తితోనే బీసీలకు రాజకీయ గుర్తింపు తెచ్చిన నాయకుడు స్వర్గీయ ఎన్టీ రామారావు**

**బీసీల సంక్షేమం మరియు అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ నిరంతరం కట్టుబడి ఉంటుంది**



**గన్నవరం:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రియల్ :11**

సమాజంలో సమానత్వం, విద్యా, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కొనియాడారు. శనివారం గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు శతాబ్దాల క్రితమే పూలే సమానత్వం, విద్య కోసం పోరాడారని, ఆయన ఆశయాలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని అన్నారు. పూలే చూపిన దారిలోనే సాగుతూ, స్వర్గీయ ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన తర్వాతే రాష్ట్రంలో బీసీలకు నిజమైన రాజ్యాధికారం లభించిందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ రాజకీయ రంగప్రవేశానికి ముందు వరకు అధికార వ్యవస్థ కొద్ది వర్గాలకే పరిమితమై ఉండేదని, మండల వ్యవస్థను ప్రవేశపెట్టి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని వివరించారు. అంతకుముందు ఉన్న రాజరిక, వంశపారంపర్య రాజకీయాలకు ముగింపు పలికి, సాధారణ ప్రజలు కూడా మంత్రుల స్థాయికి ఎదగగలిగే పరిస్థితులు ఏర్పరిచిన నాయకుడు ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితోనే బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, కూటమి నాయకులు కొండేటి వెంకటేశ్వరరావు, మోదుగుమూడి సత్యనారాయణ, జొన్నలగడ్డ సుధాకర్, కంభంపాటి లక్ష్మి నరసమ్మ, బోడపాటి రవి, మల్లారెడ్డి కిషోర్, జాస్తి శ్రీధర్, తుల్లిమిల్లి ఝాన్సీ, పాలడుగు వెంకట వరప్రసాద్, జాస్తి మురళి, కానూరు శేషు మాధవి, చిమట రవి వర్మ , అన్నే హరి కృష్ణ , మండాది రవీంద్ర, బుస్సే నాగ ప్రసాద్, కొసరాజు సాయిరాం, వలివేటి కిషోర్, మద్దినేని వెంకటేశ్వరరావు, తిరువీధి నరేష్, బుస్సే సరిత, జాస్తి రేణుక , అన్నే ధనలక్ష్మి, కాగితాల నాగరాజు, మణిమాల వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యనే ఆయుధంగా మలుచుకున్న గొప్ప యోధుడు మహాత్మా జ్యోతిబాపూలే... ఎమ్మెల్యే దేవ...



**మలికిపురం సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 11:**

మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మలికిపురంలో శాసనసభ్యులు దేవ వర ప్రసాద్ మహనీయుడు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది పూలే అని కొనియాడారు. సామాజిక ఉద్యమాల మార్గదర్శి, చదువు లేనిదే జ్ఞానం లేదు. జ్ఞానం లేనిదే పురోగతి లేదు అనే సత్యాన్ని గ్రహించి 19వ శతాబ్దపు తొలినాళ్లలో నిమ్న జాతులు, మహిళల కోసం దేశంలో మొదటిసారిగా పాఠశాలలను ఏర్పరిచిన మహనీయుడు జ్యోతి రావు పూలే అని తెలిపారు. మహిళలు, అట్టడుగువర్గాల ఆత్మగౌరవ పోరాటానికి విద్యనే ఆయుధంగా అందించిన పూలే మహాశయుని ఆశయసాధనకి కృషి చేయడం మనందరి బాధ్యత అని దేవ వర ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమం లో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గుబ్బల ఫణి కుమార్, రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ గుండుభోగుల పెదకాపు, గుబ్బల బాబ్జి, ఎస్సీ వెల్ఫేర్ అధ్యక్షులు పొలుమూరి శ్యాంబాబు, రాజోలు మండల అధ్యక్షులు కదలి శ్రీ దుర్గా మోహన్, జిల్లా సర్పంచ్ సమైక్య కార్యదర్శి చెల్లుబోయిన హేలిన, గెద్దం తులసి భాస్కర్, కాకి లక్ష్మణ్, గెద్దం పేర్రాజు, ఆకన బాబ్జి నాయుడు, మల్లిపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీనివాస్, మలే శ్రీనివాస్ గణేష్, అంజనాదేవి, గుబ్బల రవి కిరణ్, గుబ్బల సత్యనారాయణ, గెద్దం పిలిప్ రాజు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే- బిజెపి



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 11**

పట్టణం లో ఉన్న చిల్డ్రన్స్ పార్క్ దగ్గర బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక తత్వవేత్త, మహిళా విద్యాభివృద్ధికి మార్గదర్శి, నిత్య స్పూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే 199 వ జయంతి వేడుకలు బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. భారతదేశంలో స్త్రీ విద్యకు,వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పూలే వేసిన పునాదులు నేటి సామాజిక స్వేచ్ఛకు కారణమని పేర్కొన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం పూలే ఆశయాలకు అనుగుణంగానే సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని తెలిపారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన పునరుద్ఘాటించారు. భారతదేశంలో కుల రహిత, సమానత్వ సమాజం కోసం పోరాడిన యోధుడిగా ఆయన జయంతిని స్మరించుకుంటాం అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అయ్యల భాషా, జిల్లా అధికార ప్రతినిధి అరిగెల పుల్లయ్య నాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు చిలకమర్రి కస్తూరి, పావులూరి వెంకట్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు పసుపులేటి మహాలక్ష్మి, చిట్టూరి రాజేశ్వరి, కొండేటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ "వజ్రప్రహార్" కార్డన్ - సెర్చ్ ఆపరేషన్



**పుట్టపర్తి:( సిటిజన్ టైమ్స్): ఏప్రిల్ 11**

డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఆదేశాల మేరకు, ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ, ఐ జి పి,పర్యవేక్షణలో, శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు .. ఈరోజు తెల్లవారుజామున "ఆపరేషన్ వజ్రప్రహార్" కార్యక్రమంలో భాగంగా కదిరి , హిందూపురం ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు.కదిరి పట్టణంలో కుటాగుళ్ళు, ఎర్రగుంటపల్లి, కాలనీలలో కదిరి డీఎస్పీ శివన్నారాయణ స్వామి పర్యవేక్షణలో, కార్డన్ ఛ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.హిందూపురం పట్టణంలోని సిపిఐ కాలనీలో డీఎస్పీ కేవీ మహేష్ పర్యవేక్షణలో సిఐలు కరీం జనార్ధన్ నాయుడు,ల సబ్ డివిజన్ ఎస్ఐలు మరియు సిబ్బంది కలిసి అనుమానాస్పద ప్రాంతాలు, ఇళ్లు మరియు డ్రగ్స్ అమ్మకదారుల నివాసాలు, లాడ్జీలు రౌడీషీటర్స్ అనుమానిత వ్యక్తుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీలు చేయడంతోపాటు సరైన పత్రాలని వాహనాలను సీజ్ చేశారు.ఈ సందర్భంగా సి ఐ లు మాట్లాడుతూ ,రౌడీ షీటర్లు మరియు అనుమానిత వ్యక్తులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి, సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు తెలియజేయాలని డీఎస్పీ కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్త



**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఏప్రియల్ 11**

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ముమ్మిడివరం శాఖ ఆధ్వర్యంలో



మట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కన్వెన్షన్ హాల్ నందు జరిగింది. మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. వక్తలు మాట్లాడుతూ ప్రపంచ మేధావి అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, పూలే ఆశయాల నుండి స్ఫూర్తిని పొంది పూలే ని తన గురువుల్లో ఒకరిగా భావించారని అన్నారు.విద్య ద్వారానే జీవితాలు మార్చాలని ,అణచి వేయ బడుతున్న అణగారిన వర్గాల జీవితాల్లో అక్షర జ్యోతులు వెలిగించిన మహనీయుడని,ఆధిపత్య పెత్తందారులతో అక్షర యుద్ధం చేసిన గొప్ప సంఘసంస్కర్త అని అన్నారు.తన సతీమణి ఆయన సావిత్రిబాయి పూలేని మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా చేసి బడుగు వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాశి వెంకటాచార్య, జనిపల్లి సత్యనారాయణ, ఎం ఆశీర్వాదం,నక్కా శ్రీనివాస్, నేరేడుమిల్లి అబ్బులు, కటికిదల రాము, ఉండ్రు కిరణ్ కుమార్, సబ్బతి సత్యనారాయణ,పాము ఆనందరావు, జగడం భైరవ స్వామి,యు.దశరథ రామయ్య,మేడిద లక్ష్మణ్ కుమార్, జిల్లెల్ల శ్రీధర్, చికెలే తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా ఘన నివాళులు



**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 11**

సామాజిక సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఉదయం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపల్ డీఎస్పీ డి. గోవిందరావు జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావ్ పూలే అని కొనియాడారు. సమాజంలో సమానత్వం, విద్యా ప్రాధాన్యత మరియు సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నేదునూరు లో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 11**

మనం ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ మాత వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బహుజనులకు స్ఫూర్తిగా నిలుస్తూ, కుల వ్యవస్థను దిక్కరించిన మహానుభావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కల్లేపల్లి సుబ్బరాజు, తమ్మన శ్రీను, రామకృష్ణమూర్తి, గంజి చిన వీరన్న విసుగుపట్ల రాంబాబు జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**అల్లవరం సిటిజన్ టైమ్స్ ఏప్రియల్ 11**

మండలంలోని కొమరగిరిపట్నం మెట్ల రామ్మూర్తి సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఎస్ సిఎస్ చైర్మన్ రమణబాబు, కొమ్మూరు సత్తిబాబు, దెందుకూరు సత్తిబాబు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాలు కొనసాగించాలి



**విజయవాడ :( సిటిజన్ టైమ్స్ ): ఏప్రిల్ :11**

మహాత్మ జ్యోతి బాపులే 25 జయంతి సందర్భంగా విగ్రహానికి రాష్ట్ర వైఎస్సార్సీపీ కార్యదర్శి మైనారిటీ బాజీ బాబా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మహాత్మ పూలే గారు సామాజిక న్యాయం, సమానత్వం కోసం చేసిన కృషి దేశానికి మార్గదర్శకమని తెలిపారు. బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన దారి ఇప్పటికీ ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. అలాగే వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు ఇతర వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం, రాజ్యసభ స్థానాల్లోనూ వారికి అవకాశాలు కల్పించడం వంటి చర్యలు సామాజిక న్యాయానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్ర బడ్జెట్ ద్వారా బీసీలకు.సుమారు లక్షా డెబ్బై వేల కోట్ల రూపాయలను వివిధ సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి పాఠశాలలు, పింఛన్లు, గృహాలు వంటి రంగాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వివరించారు. పేదలు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని, మహాత్మ పూలే గారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతుందని బాజీ బాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హయాత్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గొలగాని శ్రీనివాసరావు విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు దుక్క హరి భాస్కర.పశ్చిమనియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీఅధ్యక్షుడు బత్తుల పాండు రాష్ట్ర బీసీ నాయకుడు దిద్దుకూరు శివ తదితర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## స్పా పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు : డీఎస్పీ సి.హెచ్. వివేకానంద

**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :11**



స్పా, మసాజ్ సెంటర్ల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సి. హెచ్. వివేకానంద ఘాటుగా హెచ్చరించారు. జిల్లాలో ఇటీవలి కాలంలో కొన్ని కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పుట్టగొడుగుల్లా పెరుగుతున్న స్పా సెంటర్లపై నిరంతర తనిఖీలు చేపట్టి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు చెక్ పెట్టే దిశగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనపై దృష్టి సారించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా స్పా, మసాజ్ సెంటర్లు నిర్వహించినా, నిబంధనలు ఉల్లంఘించినా కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడంతో పాటు సెంటర్లను సీజ్ చేసి లైసెన్సులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అవసరమైన అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహించే నిర్వాహకులతో పాటు భవన యజమానులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పా సెంటర్ల నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి కాగా, సంబంధిత పోలీస్ స్టేషన్‌కు పూర్తి వివరాలు ముందుగానే తెలియజేయాలని సూచించారు. సెంటర్‌లో లైసెన్స్ వివరాలను స్పష్టంగా ప్రదర్శించడం, సిబ్బంది పూర్తి వివరాలు మరియు ఐడీ ప్రూఫ్ నమోదు చేయడం, ప్రవేశ ద్వారాలు మరియు రిసెప్షన్ వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం వంటి నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఇకపై జిల్లాలోని అన్ని స్పా, మసాజ్ సెంటర్లపై నిరంతర నిఘాతో పాటు అకస్మిక దాడులు నిర్వహిస్తామని డీఎస్పీ తెలిపారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై "జీరో టాలరెన్స్" విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర సేవల కోసం 112 నంబర్‌తో పాటు, శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్: 6309990804 అని తెలిపారు. అందించిన సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

## జిల్లాలో అమలు చేసిన 'జలధార' ప్రాజెక్టు దేశానికే ఆదర్శం

*జలధార ప్రాజెక్టు విజయవంతంలో విశేష కృషి చేసిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను ఘనంగా సన్మానించిన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి*



**చిన్నమండెం, :( సిటిజన్ టైమ్స్): ఏప్రిల్ 11**

అన్నమయ్య జిల్లాలో అమలు చేసిన 'జలధార' ప్రాజెక్టు దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం చిన్నమండెం మండలంలో జరిగిన సూర్య ఘర్ ఉచిత సౌర విద్యుత్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. జలధార ప్రాజెక్టు విజయవంతంలో విశేష కృషి చేసిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను మంత్రిఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నీటి సంరక్షణ కార్యక్రమాల నిమిత్తం నేడు దేశం మొత్తం అన్నమయ్య జిల్లా వైపు చూస్తోందని... ఇందుకు విశేష కృషి చేసిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా యంత్రాంగానికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో బేసిన్ ఆధారిత నీటి సంరక్షణ విధానాన్ని అనుసరించి, నదీ పరివాహక ప్రాంతాలను గుర్తించి, మిగులు నీటిని లోటు ప్రాంతాలకు మళ్లించే చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. 49 ఉప పరివాహక ప్రాంతాల గుర్తింపు, 532 కాస్కేడ్స్ ద్వారా 3082 చెరువుల అనుసంధానం, 962 ఎండిపోయిన చెరువుల పునరుద్ధరణ, ఉపాధి హామీ పథకం ద్వారా విస్తృత పనులు తదితర చర్యల వల్ల వృథాగా పోయే నీటిని సమర్థంగా వినియోగంలోకి తీసుకు రాగలిగారన్నారు. వేల కోట్ల వ్యయం అవసరమయ్యే భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు బదులుగా, అందుబాటులో ఉన్న వనరులతోనే 3-4 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకు రావడం వల్ల జిల్లాలో భూగర్భ జలాల నీటిమట్టం పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించడం జరిగిందని, కేంద్రం కూడా ఆ దిశగా దృష్టి సారించడం మన జిల్లా వాసులకు గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీలకు సౌర విద్యుత్ ఉచితం

**- ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు**



**వినుకొండ, :( సిటిజన్ టైమ్స్) ఏప్రిల్: 11:**

పి యం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామ ఎస్సీ కాలనీలో రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్ ను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా కోటి ఇళ్లపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయడం ద్వారా పర్యావరణ రహిత విద్యుత్ ఉత్పత్తి చేయడమే కాకుండా, వినియోగదారులకు విద్యుత్ బిల్లులో గణనీయమైన ఆదా కలుగుతుందని తెలిపారు. ప్రతి ఇంటిపై సోలార్ ప్యానల్స్ ఉచ్చడం వల్ల కరెంట్ బిల్లు ఆదా చేసుకోవచ్చు అని వివరించారు. సూర్య ఘర్ యోజన పథకం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలను అందిస్తుందని, ఎస్సీ ఎస్టీల కుటుంబాలకు రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ రూట్ టాప్ యూనిట్ను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో 2000 కనెక్షన్లు ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా అందజేయడం జరుగుతుందని, ఒక్కొక్కరికి 1.44 లక్షలు రాయితీపడం జరుగుతుందన్నారు. బీసీ కుటుంబాలకు సూర్య ఘర్ సోలార్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 98000 రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడం వల్ల 78,000 కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తుందని వివరించారు. సోలార్ ప్యానల్ ఏర్పాటుతో కరెంటు బిల్లులు ఆధార్ కావడంతో పాటు, విద్యుత్ ఉత్పాదకత ఇస్తుందని, మిగిలిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వివరించారు. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తూ ఎస్సీ ఎస్టీ వినియోగదారుల కోసం యుటిలిటీ లెడ్ అగ్రికేసన్ విధానంలో 2 కిలోవాట్ల సౌర రూట్ టాప్ ప్లాంట్లను ఉచితంగా ఏర్పాటు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీల వినియోగదారులకు ప్రతినెల 2 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తుందని వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఉచిత సౌర విద్యుత్ అవకాశాన్ని నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీల కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**పూలే ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకం -చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్**

**అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి మహాత్మా జ్యోతిరావు పూలే కృషి**

**చింతలపూడి:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రిల్ :11**

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. శనివారం నాడు చింతలపూడి వేముల పేట లో స్థానిక నేతలతో కలిసి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ, మహిళా విద్య, దళిత, బడుగు వర్గాల హక్కులకు, కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని తెలిపారు. సామాజిక ఉద్యమాలు నడిపి నిస్వార్థంగా సామాజిక వికాసానికి విలువలు నేర్పుతూ మార్గదర్శిగా నిలిచారన్నారు. సమసమాజ నిర్మాణంలో జ్యోతిరావు పూలే కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే మనం అర్పించే ఘన నివాళి అని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.



# ఆరోగ్యం

## నల్లద్రాక్ష... స్త్రీల ఆరోగ్యానికి రక్ష



పుల్లగా, తీయగా ఉండే ద్రాక్షలో పోషకాలు ఎక్కువే. అందులోనూ నల్లద్రాక్షలో మహిళలకు మేలు చేసే సుగుణాలెన్నో! మరి వాటి గురించి తెలుసుకుందామా... నల్లద్రాక్ష ముందస్తు వృద్ధాప్య ఛాయల్ని అదుపులో ఉంచుతుందట. ముఖ్యంగా కొలాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో చర్మం తాజాగా మెరిసిపోతుంది. ఈ పండ్లలో ఉండే రెస్వెరాట్రాల్ సహజ ఈస్ట్రోజన్‌లా పనిచేసి హార్మోన్ల అసమతుల్యత రాకుండా చేస్తుంది. వేడిఆవిర్లు, మూడ్ స్వింగ్స్ వంటి వాటిని అదుపులో ఉంచుతుంది. ఎముక బలాన్ని కాపాడుతుంది. రెస్వెరాట్రాల్, పాలీఫెనాల్స్ నల్లద్రాక్షలో మెండుగా ఉంటాయి. ఇవి శరీరంలో రొమ్ముక్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకుంటాయి. దీంతో ఆ ముప్పు తగ్గుతుంది. మెనోపాజ్ తర్వాత మహిళలు గుండెజబ్బుల బారిన పడుతుంటారు. నల్లద్రాక్షలో ఉండే ఫైటోకెమికల్స్ చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి కండరాలకు మేలుచేస్తాయి. రక్తపోటు అదుపులో ఉండటమే కాదు... గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. బరువు తగ్గాలనుకునేవారు ఈ పండ్లను తీసుకుంటే సరి. వీటిలోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని వ్యర్థాలను తొలగించి, బరువు తగ్గించేందుకు కారణం అవుతాయి.

## అందానికి పిల్లో మంత్ర..



ముఖం అందంగా కనిపించాలని తినే ఆహారం దగ్గర నుంచి రాసుకునే క్రీమ్ వరకూ ప్రతి విషయంలోనూ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు అమ్మాయిలు. కానీ, ముఖంపై మొటిమలు, ముడతలు, గీతలకి మనం రోజూ నిద్రపోయే తలగడ కూడా కారణం అంటున్నాయి అధ్యయనాలు. ఇవి మనకు తెలియకుండానే వృద్ధాప్యాన్ని తెచ్చిపెడుతున్నాయట. మరి దీన్నుంచి రక్షణ పొందాలంటే... ఈ జాగ్రత్తలు పాటించాలి. నిద్రలో ఉన్నప్పుడు కొంతమంది ఒక వైపు తిరిగి నిద్రపోడం, లేదా బోర్లా పడుకోవడం చేస్తారు. దీనివల్ల ముఖంపై ఒత్తిడి పడుతుంది. దాంతో గీతలు ఏర్పడి క్రమంగా అవి ముడతలుగా మారేందుకు ఆస్కారం ఉంది. అంతేకాదు, కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గుతుంది. అలసటను దూరం చేసుకోవడానికి నిద్రపోతాం. పక్క సరిగ్గా ఉందా, ఫ్యాన్ తిరుగుతుందా అని చూస్తాం. వీటితోపాటూ తలకింద ఉండే దిండు శుభ్రంగా ఉందా అనేదీ గమనించుకోవాలి. ఎందుకంటే... రాత్రి సమయంలో మన చర్మంపై ఉండే మృతకణాలు, నూనెలు, మేకప్ అవశేషాలు పిల్లో మీదకే వచ్చి చేరతాయి. వీటికి బ్యాక్టీరియా తోడై అలర్జీలకూ దారి తీస్తాయి. అందుకే రోజుకోసారైనా దిండులోని దుమ్ము పోయేలా దులపాలి. చర్మంలోని సహజ నూనెలను దిండ్లు పీల్చేస్తాయి. దీంతో చర్మం పొడిబారుతుంది. అందుకే వీటి ఎంపికలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. కాటన్ లేదా శాటిన్ రకాలను ఎంచుకుంటే మంచిది. ఇవి ఒత్తిడి తగ్గించి, నూనెలను పీల్చుకోకుండా కొంతవరకూ అడ్డుకుంటాయి. అంతేకాదు, వారానికోసారి గలేబులను మార్చాలి. గోరువెచ్చని నీటిలో రసాయనాలు లేని డిటర్జెంట్లతో ఉతకాలి. కనీసం నెలకోసారైనా పిల్లోలను ఎండలో ఉంచాలి. వాటిలో దుమ్ము చేరకుండా ఉండేందుకు యాంటీ రింకిల్ పిల్లోలు, ప్రొటెక్టర్లూ, హైపోఅలర్జెనిక్ పిల్లో కవర్లను వాడాలి. మూడేళ్లకోసారి దిండ్లు మారుస్తూ ఉండాలి. వీటితోపాటు వెల్లకిలా పడుకోవడం అలవాటు చేసుకోవాలి. రాత్రి సమయంలో చర్మం తేమను కోల్పోకుండా మాయిశ్చరైజర్ రాయాలి. అలాగే గది ఉష్ణోగ్రతలు తగ్గకుండానూ చూసుకోవాలి.

## చలికాలానికి... చిలగడ దుంప...



చలికాలం వచ్చిందంటే ఆలస్యంగా నిద్రలేవడం, బద్ధకంగా ఉండటం, ఆకలి తగ్గడం వంటివి కనిపిస్తాయి. అంతేకాదు, బయట పడిపోతున్న ఉష్ణోగ్రతల నుంచి మనల్ని వెచ్చగా ఉంచడానికి మన శరీరం ఎక్కువ శక్తినీ ఖర్చు చేస్తుంది. దాంతో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. చలికాలం వచ్చిందంటే ఆలస్యంగా నిద్రలేవడం, బద్ధకంగా ఉండటం, ఆకలి తగ్గడం వంటివి కనిపిస్తాయి. అంతేకాదు, బయట పడిపోతున్న ఉష్ణోగ్రతల నుంచి మనల్ని వెచ్చగా ఉంచడానికి మన శరీరం ఎక్కువ శక్తినీ ఖర్చు చేస్తుంది. దాంతో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. అందుకే మనం తినే ఆహారం మన శక్తిస్థాయుల్ని పెంచాలి. జీర్ణక్రియను మెరుగుపరిచి, సీజనల్ ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడేదిగా ఉండాలి. ఇందుకు చిలగడ దుంప మంచి ఎంపిక. దీంతో చాలా ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. చిలగడ దుంపలో విటమిన్ ఎ, సి, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శ్వాసకోశ గోడలకు రక్షణ కల్పించి వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తాయి. దీనిలో ఉండే కార్బోహైడ్రేట్లు మన శరీరానికి కావాల్సిన శక్తిని నెమ్మదిగా విడుదల చేస్తాయి. దాంతో శీతకాలంలో వచ్చే అలసటను దూరం చేసి చురుకుగా ఉండేందుకు సహకరిస్తాయి. వాతావరణం చల్లగా ఉందని నీరు తక్కువగా తాగుతాం. దాంతో చర్మం పొడి బారుతుంది. అయితే ఇందులో ఎక్కువగా ఉండే నీటిశాతం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కి గురికాదు. చిలగడదుంపలో ఉండే పీచుపదార్థం జీర్ణక్రియను పెంచుతుంది. పేగులో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేసి గట్‌హెల్త్‌ను ప్రోత్సహిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు, ఆంథోసైనిన్లు సమృద్ధిగా ఉండే స్వీట్ పొటాటో వృద్ధాప్య ఛాయల్నీ తగ్గిస్తుంది. చర్మాన్ని మృదువుగా చేసి, సహజ మెరుపునిస్తుంది. అందుకే దీన్ని, సూప్‌చేసి లేదా ఉడికించి చిరుతిండిగా తీసుకుంటే మంచిది.

## రోజుకో పూట చపాతీ తినాలట



బరువు తగ్గాలనుకునే వారు ప్రతి విషయంలోనూ ప్రత్యామ్నాయాల్ని వెతుక్కుంటుంటారు. రాత్రుళ్లు అన్నం మానేసి చపాతీ తీసుకోవడం కూడా ఇలాంటిదే! అయితే రాత్రి భోజనంలో చపాతీని భాగం చేసుకోవడం వల్ల బరువు తగ్గడంతో పాటు మరెన్నో ఆరోగ్య ప్రయోజనాల్ని సొంతం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. బరువు తగ్గాలనుకునే వారు ప్రతి విషయంలోనూ ప్రత్యామ్నాయాల్ని వెతుక్కుంటుంటారు. రాత్రుళ్లు అన్నం మానేసి చపాతీ తీసుకోవడం కూడా ఇలాంటిదే! అయితే రాత్రి భోజనంలో చపాతీని భాగం చేసుకోవడం వల్ల బరువు తగ్గడంతో పాటు మరెన్నో ఆరోగ్య ప్రయోజనాల్ని సొంతం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. మరి, చపాతీలో దాగున్న ఆ ఆరోగ్య రహస్యాలేంటో తెలుసుకుందాం రండి..

**పోషకాల సమ్మేళనం!**

చపాతీని పోషకాల సమ్మేళనంగా పేర్కొంటున్నారు నిపుణులు. ఇందులో 'బి', 'ఇ' విటమిన్లతో పాటు కాపర్, జింక్, అయొడిన్, మాంగనీస్, సిలికాన్, పొటాషియం, క్యాల్షియం.. వంటి ఖనిజాలు లభిస్తాయి. అంటే.. ఇవన్నీ రోజువారీ శరీరానికి కావాల్సిన పోషకాలను కొద్ది మొత్తాల్లో భర్తీ చేస్తాయన్నమాట! చపాతీలో ఉండే సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు శరీరానికి శక్తిని అందిస్తాయి. తద్వారా రోజంతా ఉత్సాహంగా ఉండచ్చు. చపాతీల్లో ఉండే ఐరన్ స్థాయులు శరీరంలో హెమోగ్లోబిన్ స్థాయుల్ని క్రమబద్ధీకరిస్తాయి. చపాతీల్లో ఉండే జింక్, ఇతర ఖనిజాలు చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహకరిస్తాయంటున్నారు నిపుణులు. ఇందులో ఉండే పీచు జీర్ణవ్యవస్థకూ మంచిదే! అజీర్తి, గ్యాస్, మలబద్ధకం.. వంటి జీర్ణ సంబంధిత సమస్యలున్న వారు నిపుణుల సలహా మేరకు రోజూ చపాతీని ఆహారంలో భాగం చేసుకోవడం ఉత్తమం. గుండె ఆరోగ్యానికీ చపాతీ మేలు చేస్తుందట! ఇందుకు దీనిలో అతి తక్కువ కొవ్వులుండడమే కారణమంటున్నారు నిపుణులు.

**ఇలా చేసుకోవాలట!**

చపాతీ ఆరోగ్యానికి మంచిదే కదా అని ఎక్కువ నూనె, నెయ్యితో చేసుకోవడం వల్ల శరీరంలో అనవసర కొవ్వులు చేరతాయంటున్నారు నిపుణులు. అందుకే వీలైనంత తక్కువ నెయ్యి/నూనెను వాడడం మంచిదంటున్నారు. అసలు ఈ రెండూ ఉపయోగించకుండా పుల్కా చేసుకొని తింటే మరీ మంచిదట! బయట దొరికే గోధుమపిండిలో మైదా కలిసే అవకాశం ఉంటుంది. కాబట్టి ముడిగోధుమలు తీసుకొని స్వయంగా పట్టించుకొని ఆ పిండితో చపాతీ చేసుకుంటే మంచిది. చపాతీకి జతగా రోజూ పప్పు, బంగాళాదుంప కర్రీ అని కాకుండా అన్ని రకాల కాయగూరలతో చేసిన కూరలు తీసుకోవడం వల్ల పోషకాలన్నీ శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు. బీన్స్, క్యారట్ ముక్కలు, పాలకూర.. వంటి వాటిని ఉడికించి.. గోధుమ పిండి కలిపేటప్పుడు అందులో వేసి చపాతీ చేసుకుంటే అటు రుచికి రుచి.. ఇటు ఆరోగ్యానికి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చట. గోధుమపిండికి రాగి పిండి, సోయాబీన్ పిండి, చిరుధాన్యాలతో తయారుచేసిన పిండి.. వంటివి కూడా కలుపుకొని చపాతీ తయారుచేసుకోవచ్చు. లేదంటే బయట దొరికే మల్టీగ్రెయిన్ పిండిని కూడా వాడుకోవచ్చు. అయితే అందులో మైదా 0%గా ఉండాలన్న విషయం గుర్తుపెట్టుకోండి. ఈ విషయం లేబుల్ చూస్తే అర్థమవుతుంది.

## అందానికీ క్యారెట్..

రోజంతా ఇంటి పనులు, ఉద్యోగం అంటూ పరుగులు పెట్టే మహిళలు తమ ఆరోగ్యాన్ని మాత్రం నిర్లక్ష్యం చేస్తుంటారు. మరి వారికి కావల్సిన పోషకాలన్నీ దొరికే క్యారెట్‌ను రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్ని ప్రయోజనాలు పొందొచ్చో తెలుసా? రోజంతా ఇంటి పనులు, ఉద్యోగం అంటూ పరుగులు పెట్టే మహిళలు తమ ఆరోగ్యాన్ని మాత్రం నిర్లక్ష్యం చేస్తుంటారు. మరి వారికి కావల్సిన పోషకాలన్నీ దొరికే క్యారెట్‌ను రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్ని ప్రయోజనాలు పొందొచ్చో తెలుసా? వయసు పెరిగే కొద్దీ ముఖంపై ముడతలు, గీతలు సాధారణమే, క్యారెట్ దీనికి మంచి పరిష్కారం. ఎ, కె, బి6 విటమిన్లతోపాటు బయోటిన్, మినరల్స్, బీటా కెరోటిన్‌లు దీనిలో ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మానికి సహజ టానిక్‌లా పనిచేస్తాయి. విటమిన్ ఎ చర్మం పొడిబారడాన్ని తగ్గిస్తే... ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు వృద్ధాప్య ఛాయల్ని రానివ్వకుండా కాపాడతాయి. ఉద్యోగరీత్యా కంప్యూటర్లు, ఫోన్లతో గడిపే సమయం పెరిగిపోయింది. దీంతో కంటి సమస్యలు పెరుగుతున్నాయి. క్యారెట్‌లోని బీటా కెరోటిన్ మన శరీరంలోకి వెళ్లి విటమిన్-ఎగా మారుతుంది. ఇది కంటి చూపుని కాపాడుతుంది. బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి ఎంపిక. దీనివల్ల ఆకలి తగ్గుతుంది. బరువు నియంత్రణలో ఉంటుంది. మహిళల్లో మెనోపాజ్ తరవాత గుండె సంబంధిత వ్యాధుల్నీ, రక్తపోటునీ నియంత్రిస్తుంది. ఇందులో ఉండే కెరోటినాయిడ్లు, ఫ్లేవనాయిడ్లు ఆరోగ్యానికి చాలా మంచివి. యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం మెదడు, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. రక్తపోటుని అదుపులో ఉంచుతాయి. ఒత్తిడిని దూరం చేస్తాయి. టాక్సిన్లను బయటకు పంపి కాలేయాన్ని శుభ్రపరుస్తాయి. అందుకే సలాడ్, కూర, సూప్, జ్యూస్‌ల రూపంలో క్యారెట్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యం మన సొంతం.



# హిట్‌మెషీన్‌ని బాగా కష్టపెట్టిన సినిమాలివా?







కొంత మంది కెరీర్‌లో ఎన్ని చేసినా కష్టతరమైనవి కొన్ని ఉంటుంటాయి. అలాంటి కష్టమైన, తనని కష్టపెట్టిన సినిమాలు ఉన్నాయట హిట్ మెషీన్ అనిల్ రావిపూడి కెరీర్‌లో. స్టార్ డైరెక్టర్ రాజమౌళి తరువాత అపజయమెరుగని డైరెక్టర్ ఎవరైనా ఉన్నారంటే అది హిట్ మెషీన్ అనిల్ రావిపూడి మాత్రమే. -పటాస్- నుంచి దర్శకుడిగా కెరీర్ ప్రారంభించిన అనిల్ రావిపూడి ఇప్పటి వరకు తొమ్మిది సినిమాలని రూపొందించారు. ఇందులో ప్రతి సినిమా సూపర్ హిట్, బ్లాక్ బస్టర్ అనిపించుకున్నావే. ఎఫ్ 2తో సంక్రాంతి బ్లాక్ బస్టర్లకు తెరలేపిన అనిల్ రావిపూడి సరిలేరు నీకెవ్వరు, సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు- వంటి సినిమాలతో సంక్రాంతి బ్లాక్ బస్టర్లని అందించి అపజయమెరుగని దర్శకుడిగా సరికొత్త ట్రాక్ రికార్డ్‌ని సొంతం చేసుకున్నారు. ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కామెడీని జోడించి ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడంలో దిట్ట అని పేరు తెచ్చుకున్న అనిల్ రావిపూడి వరుసగా ఇప్పటి వరకు 9 సినిమాలతో సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిపించుకున్నారు. అయితే ఈ తొమ్మిది సినిమాల్లో అనిల్ రావిపూడిని అత్యంత కష్టంగా అనిపించిన సినిమాలు రెండు అని అట. ఈ విషయాన్ని ఓ పోడ్ కాస్ట్‌లో మాట్లాడుతూ స్వయంగా ఆయనే అంగీకరించారు. ప్రతి సినిమాకు స్ట్రగుల్ అనేది ఉంటుంది. అయితే నాకు కాంప్లీకేటెడ్‌గా అనిపించిన సినిమా -భగవంత్ కేసరి- స్క్రిప్ట్. ఇందులో ఫన్ తక్కువ.. చాలా డ్రామా ఉంటుంది. సోషల్ కంటెంట్ ఉంది. విలన్ కాన్‌ఫ్లిక్స్ అందులో మళ్లీ ఫ్లాష్ బ్యాక్. కొద్దిగా వెయిట్ ఉన్న కథ. భగవంత్ కేసరి కథలో లోడ్ ఎక్కువ ఉంటుంది. -సరిలేరు నీకెవ్వరు- కథ కూడా అంతే. ఈ రెండు కథలు బాగా లోడ్ ఎక్కువ ఉన్న కథలు. ఈ రెండు నాకు కొంచెం టఫ్ అనిపించాయి. అయితే మిగతావన్నీ లైటర్ వేన్ స్క్రిప్ట్స్ బట్ ట్రీట్మెంట్ కష్టంగా ఉంటాయి. అయితే భగవంత్ కేసరి, సరిలేరు నీకెవ్వరు సినిమాలు కథ కష్టంగా ఉంటది ట్రీట్మెంట్ చాలా కష్టం. కానీ మిగతావి అలా కాదు. మిగత కథలు కామెడీ ప్రధానంగా సాగివి అయితే దేని కష్టం దానిదే కానీ భగవంత్ కేసరి, సరిలేరు నీకెవ్వరు చిత్రాలు మాత్రం లోడ్ ఎక్కువున్నవి కావడంతో కొంత కష్టంగా అనిపించాయి- అన్నారు.

ఈ రెండు సినిమాల్లో -భగవంత్ కేసరి- సినిమా సామాజిక అంశం నేపథ్యంలో రూపొందిన మూవీ కాగా, -సరిలేరు నీకెవ్వరు- దేశ భక్తి ప్రధానంగా రూపొందిన సినిమా. ఇందులో -భగవంత్ కేసరి- ఆధారంగా కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ -జన నాయగన్-గా రీమేక్ చేయడం తెలిసిందే. జనవరిలో రిలీజ్ కావాల్సిన ఈ మూవీ రాజకీయ వివాదం కారణంగా రిలీజ్ ఆలస్యం అవుతూ వస్తోంది.

# అభిషేక్-హెడ్ తుఫాన్ బ్యాటింగ్.. పంజాబ్ కింగ్స్ టార్గెట్ ఎంతంటే!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్ తో జరుగుతున్న సన్ రైజర్స్ హైదరాబాద్ పంజా విసిరింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఎస్ఆర్?హెచ్ ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసకరమైన బ్యాటింగ్ తో విరుచుకుపడగా, మరోవైపు హెడ్ మాత్రం బౌండరీలు బాదుతూ పంజాబ్ బౌలర్లకు చుక్కలు చూపెట్టాడు. ఈ క్రమంలో అభి ఫాస్టెస్ట్ 50 అందుకున్నాడు. 18 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడీ లెఫ్ట్ హ్యాండర్. అతని దెబ్బకు సన్ రైజర్స్ హైదరాబాద్ స్కోర్ బోర్డు పరుగులు పెట్టింది. ఈ క్రమంలో శశాంక్ సింగ్ బౌలింగ్ లో ఈ ఓపెనర్లు ఇద్దరు పెవిలియన్ కి చేరుకున్నారు. టాస్ ఓడి బ్యాటింగ్ కి దిగిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్లు విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగారు. కానీ 9వ ఓవర్ వేసిన శశంక్ సింగ్ బౌలింగ్ లో ఫస్ట్ బంతికే ట్రావిస్ హెడ్ (23 బంతుల్లో 5 ఫోర్లు 1 సిక్సులతో 38 పరుగులు) అవుట్ అయ్యాడు. హాఫ్ సెంచరీతో చెలరేగిన అభిషేక్ శర్మ (28 బంతుల్లో 5 ఫోర్లు 8 సిక్సులతో 74 పరుగులు)ని కూడా అదే ఓవర్లో శాశంక్ వేసి స్లో బాల్ కి వికెట్ ఇచ్చేసి అభి పెవిలియన్ కి చేరుకున్నాడు. దీంతో ఒకే ఓవర్లో రెండు వికెట్లు నష్టపోయి ఇబ్బందుల్లో పడింది.

అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ సన్ రైజర్స్ జట్టు నెట్ రన్ రేట్ తగ్గకుండా జాగ్రత్తగా బ్యాటింగ్ చేశారు.. ఈ క్రమంలో అర్షదీప్ బౌలింగ్ లో డీప్ వికెట్ మీదుగా ఆడిన భారీ షాట్ కి బౌండరీ లైన్ దగ్గర మార్కో యాన్సెన్ క్యాచ్ పట్టడంతో ఆరెంజ్ ఆర్మీ కెప్టెన్ ఇషాన్ ( 17 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్సుతో 27 పరుగులు) మైదానం వీడాడు. తర్వాత పంజాబ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో అనికేత్ వర్మ-- క్లాసెన్ సుమారు 2 ఓవర్ల పాటు నెమ్మదిగా బ్యాటింగ్ చేశారు.

ఇక 16వ ఓవర్ నుంచి మళ్లీ బ్యాటింగ్ లో ఆరెంజ్ ఆర్మీ దూకుడు పెంచింది. యుజేంద్ర చాహల్ వేసిన మొదటి బంతిని సిక్స్, మూడో బాల్ ని ఫోర్ కొట్టి మంచి ఊపుమీదున్న అనికేత్ వర్మ (18) రనౌట్ అయ్యాడు. అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన సలీల్ ఆరోరా పెద్దగా ఇంపాక్ట్ చూపించలేకపోయాడు. కేవలం 9 రన్స్ మాత్రమే చేసి వెనుదిరిగాడు. ఇక చివర్లో క్లాసెన్ కూడా పెవిలియన్ కి చేరడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు 219 పరుగులు చేసింది. పంజాబ్ కింగ్స్ ముందు 220 పరుగుల టార్గెట్ ఉంది. పంజాబ్ బౌలర్లలో శాశంక్ సింగ్, అర్షదీప్ సింగ్ తలో రెండు వికెట్లు తీసుకోగా, జేవియర్ బార్ట్‌లెట్ ఒక వికెట్ పడగొట్టాడు.

# అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్.. సన్‌రైజర్స్‌పై భారీ టార్గెట్‌ను ఊదేసిన పంజాబ్



ఐపీఎల్ 2026 సీజన్‌లో పరుగుల వరద కొనసాగుతోంది. న్యూ చండీగఢ్ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై పంజాబ్ కింగ్స్ 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. సన్‌రైజర్స్ నిర్దేశించిన 220 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 7 బంతులు మిగిలి ఉండగానే కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (69 నాటౌట్), ప్రియాన్ష్ ఆర్య (57), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (51) హాఫ్ సెంచరీలతో చెలరేగి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. భారీ లక్ష్య ఛేదనలో పంజాబ్‌కు ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ సన్‌రైజర్స్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో పంజాబ్ గెలుపు సులువే అనిపించింది. అయితే, సన్‌రైజర్స్ బౌలర్ శివాంగ్ కుమార్ (3/33) ఒకే ఓవర్‌లో వీరిద్దరినీ ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (33 బంతుల్లో 69 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. తనదైన శైలిలో బౌండరీలతో విరుచుకుపడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (28 బంతుల్లో 74) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. తన ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 8 భారీ సిక్సర్లతో విధ్వంసం సృష్టించాడు. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (38)తో కలిసి తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరి దూకుడుతో సన్‌రైజర్స్ భారీ స్కోరు చేయగలిగినా, బౌలర్ల వైఫల్యంతో ఓటమి తప్పలేదు. ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ చరిత్రలో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. డే/నైట్ మ్యాచ్‌లో 215కు పైగా పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించిన తొలి జట్టుగా నిలిచింది. ఈ భారీ ఛేదనతో పంజాబ్ జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు కాగా, మరోసారి బౌలింగ్‌లో విఫలమైన సన్‌రైజర్స్ కు నిరాశ తప్పలేదు.

# చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య కీలక మ్యాచ్.. ఈ పోరులో ఎవరు గెలుస్తారంటే!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఆసక్తికరమైన పోరు జరగనుంది. ఈ మ్యాచులో గెలిచి టోర్నీలో ఖాతా ఓపెన్ చేయాలని ఎల్లో ఆర్మీ చూస్తుండగా.. చెన్నపై విజయం సాధించి గుజరాత్ పై ఒక్క రన్ తేడాతో ఓడిన బాధని దిగమింగుకోవాలని చూస్తుంది. దీంతో ఈ రెండు జట్లకి మ్యాచ్ గెలవడం చాలా ముఖ్యం. చెన్నై సూపర్ కింగ్స్ : ఈ సీజన్‌లో చెన్నై ఆటతీరు ఫ్యాన్స్ ని తీవ్ర నిరాశకు గురి చేస్తుంది. ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయిన సీఎస్‌కే, బ్యాటింగ్ వైఫల్యంతో ఇబ్బంది పడుతోంది. ఫామ్ కోల్పోయిన సంజూ శాంసన్ ఈ మ్యాచులో ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. జట్టుకు ఊరటనిచ్చే విషయం ఏమిటంటే, విధ్వంసకర బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ తుది జట్టులోకి రావడం. అతని రాకతో సీఎస్‌కే బ్యాటింగ్ లైనప్ మరింత బలోపేతం కానుంది.

ఢిల్లీ క్యాపిటల్స్ : అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ జట్టు అద్భుతమైన ఫామ్‌లో ఉంది. గత మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన పోరులో కేవలం ఒకే ఒక్క పరుగుతో ఓడిపోయినప్పటికీ, ఆ జట్టు ఆత్మవిశ్వాసం ఏమాత్రం తగ్గలేదు. డేవిడ్ మిల్లర్ గత మ్యాచ్‌లో అద్భుతంగా ఆడినప్పటికీ తృటిలో విజయాన్ని దక్కించులేకపోయారు.

**పిచ్ రిపోర్ట్:**

సాధారణంగా చెన్నై పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుంది, కానీ ఇటీవలి కాలంలో ఇక్కడ భారీ స్కోర్లు నమోదు అవుతున్నాయి. బ్యాటర్లకు స్వర్గధామంగా మారిన ఈ పిచ్‌పై మరోసారి పరుగుల వరద పారే ఛాన్స్ ఉంది. ఈ ఫ్లాట్ ట్రాక్‌పై టాస్ గెలిచిన జట్టు భారీ స్కోరు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటుంది.

**ఎవరు గెలుస్తారంటే?**

ప్రస్తుత ఫామ్ ప్రకారం ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింటిని గెలిచిన ఢిల్లీ, పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతుంది. ఈ మ్యాచ్ గెలిస్తే వారు మూడో స్థానానికి వెళ్తారు. కానీ డెవాల్డ్ బ్రెవిస్ రాకతో చెన్నై కూడా గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776